యోగాతో వ్యాధులు దూరం

ఆయుష్ యోగా కేంద్రం
డైరెక్టర్ డాక్టర్ సత్యారెడ్డి

రామంతాపూర్ : ఆహార నియమాలతో నియమబద్ధమైన జీవనశైలి తగినంత విశ్రాంతితో పాటు నిత్యం యోగసాధన చేసిన వారు గుండె సంబంధిత వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని ఆయుష్ యోగా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ దొడ్ల సత్యారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాల భారతి స్కూల్‌లో 'యోగాసనాలు వ్యాధుల నివారణ' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధిక రక్తపోటు మధుమేహం, ఉబకాయం, థైరాయిడ్, సైనస్ మైగ్రేన్ తలనొప్పి, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులను యోగా థెరపీ ద్వారా నివారించవచ్చన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రతిరోజూ ఉదయం సాయంత్రం, స్థానిక బాలభారతి పాఠశాలలో ప్రత్యక్షంగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తరగతులు ఈనెల 5 నుంచి ప్రారంభిస్తున్నామని ఆసక్తి కలిగిన వారు 9246173775 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రసన్నాంజనేయ స్వామికి చందనాభిషేకం



అల్వాల్: సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అల్వాల్ సీతారామ నామ సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శివాలయంలో ప్రసన్నాంజనేయస్వామికి చందనాభిషేకం, నాగవల్లి దళార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వడ మాల ధరింపజేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు రమణపంతులు, శ్రీనివాస్ రావు, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో చిన్నారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఉగాది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరుణశ్రీ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మూషికవాహన, తాండవ నృత్యకారి, గరుడగమన తదితర అంశాలతో కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేస్తాం



రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలను ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బి- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

పెయింట్ డబ్బాల తయారీ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



కుషాయిగూడ: పెయింట్ డబ్బాల తయారీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. అప్రమత్తమైన సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంగళవారం చర్లపల్లి పారిశ్రామికవాడ, ఫేస్-2 లోని క్యాన్ అండ్ క్యాన్ కంపెనీలో ఒక్కసారిగా క్యాబిన్‌లో మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన సిబ్బంది అప్రమత్తమై ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్, పోలీసు సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని ఎస్సై శేఖర్ పేర్కొన్నారు.

టార్గెట్ రీచ్ !



- కాప్రా సర్కిల్‌లో రూ. 61.59 కోట్ల ఆస్తిపన్ను వసూలు
- ఓటీఎస్ ద్వారా రూ.8.48 కోట్ల ఆదాయం
- గతేడాది కంటే రూ.3 కోట్ల పెరుగుదల
- చివరి రోజు రూ.2.42 కోట్లు

ఉప్పల్/కాప్రా: ఆస్తిపన్ను వసూళ్లలో ఉప్పల్, కాప్రా సర్కిళ్లు రికార్డు సృష్టించాయి. ఉప్పల్ ఆస్తిపన్ను దాదాపుగా రూ. 36 కోట్ల వరకు వసూలు చేయాల్సి ఉండగా.. రూ. 37 కోట్లకు పైగానే వసూలైంది. సోమవారం ఒక్కరోజే దాదాపుగా రూ. 1.68 కోట్ల వరకు వసూలైనట్లు డీసీ ఆంజనేయులు పేర్కొన్నారు.

◆ కాప్రా సర్కిల్ పరిధిలో గతేడాది కంటే ఈసారి రూ.3 కోట్లకు పైగా వసూలు చేసింది. జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ అధికారులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజున సోమవారం ఒక్క రోజే రూ.2.42 కోట్లు ఆదాయం వచ్చింది. మొత్తం రూ. 61.59 కోట్లు వసూలైనట్లు కాప్రా సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు ప్రకటించారు. నిర్దేశించుకున్న రూ.61.19 కోట్లకు మించి వసూలు చేసినట్లు తెలిపారు. ఇందులో మార్చి నెల 8 నుంచి అమలు చేసిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ (ఓటీఎస్) ద్వారా రూ.8.48 కోట్లు వచ్చాయని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గతేడాది కూడా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అధిగమించామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.57 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకుంటే రూ.58.4 కోట్లు వసూలైనట్లు వివరించారు.

బోడుప్పల్‌లో ఆస్తిపన్ను వసూళ్లు రూ.20.42 కోట్లు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 2024-2025 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను రూ 20.42 కోట్లు వసూలైనట్లు కమిషనర్ శైలజ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మొత్తం డిమాండ్ రూ.31.20 కోట్లు ఉండగా.. 65.44 శాతం వసూలైందన్నారు. గతనెల రోజులుగా రెవెన్యూ అధికారులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది 12 టీమ్‌లుగా ఏర్పడి పన్ను వసూలు కోసం కృషి చేసినట్లు వెల్లడించారు. మొండి బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక మొబైల్ టీమ్ (జప్తు వాహనం)తో బకాయిదారుల ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేశామన్నారు. బకాయిల వసూళ్లలో కష్టపడిన రెవెన్యూ అధికారులు, వార్డు ఆఫీసులు, సిబ్బందిని ఆమె ఈ సందర్భంగా అభినందించారు.

ముందస్తు చెల్లింపుతో 5 శాతం రాయితీ..



నేటి నుంచి ఎర్లీబర్డ్ స్కీమ్ అమలులోకి వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందుగానే ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తే 5 శాతం రాయితీ ఉంటుంది. ఆస్తి పన్ను చెల్లింపుదారులు నెలాఖరు వరకు ఉండే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఆంజనేయులు, ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

ఎర్లీబర్డ్ స్కీమ్ అమలు..



జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ పరిధిలో ఏప్రిల్ 1 నుంచి ఎర్లీబర్డ్ స్కీమ్ అమలులోకి వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందుగానే ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రిబేట్ రానుంది. ఈ అవకాశం ఈ నెలాఖరు వరకు ఉంటుంది. ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జగన్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్

ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతతకు మార్గం



మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

మల్కాజిగిరి: ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతతకు మంచి మార్గంగా ఉపయోగపడుతుందని ప్రముఖ నటుడు సుమన్ అన్నారు. ఓల్డ్ మల్కాజిగిరిలో పునర్నిర్మాణంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పలు ఆధ్యాత్మిక చిత్రాల్లో నటించే అదృష్టం కలిగిందన్నారు. హిందూధర్మ పరిరక్షణకు ఆధ్యాత్మికత కీలకమన్నారు. హిందూ దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దేవాలయ పునర్నిర్మాణ దాత మల్లేష్‌గౌడ్‌ను అభినందించారు. కార్పొరేటర్ శ్రవణ్, నాగరాజు, శోభన్‌బాబు, హన్మయ్య, జయరాం తదితరులున్నారు.

సన్నబియ్యం పంపిణీ షురూ !

రేషన్ షాపులను సందర్శించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మంగళవారం ప్రారంభమైంది. జిల్లాలోని 618 రేషన్ దుకాణాల నుంచి ఆహార భద్రతా కార్డులు కలిగి ఉన్న పేదలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. జిల్లాలో 5.28 లక్షల ఆహార భద్రతా కార్డులు ఉండగా.. వీరందరికి ప్రతినెల 10,761.697 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 618 రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. సన్న బియ్యాన్ని ఆహారభద్రతా కార్డులు కలిగి ఉన్న నిరుపేద కుటుంబాలన్నింటికీ పూర్తయ్యే వరకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జి అధికారి సుగుణాబాయి తెలిపారు. జిల్లాలో సన్నబియ్యం పంపిణీ సక్రమంగా సాగేలా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఉప్పల్, నాగోల్, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో సన్నబియ్యం పంపిణీపై పర్యవేక్షణ చేసిన అదనపు కలెక్టర్ లబ్ధిదారులతో ముచ్చటించారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయని, పలువురిని అడిగి తెలుసుకున్న ఆయన వారితో సంతోషాన్ని పంచుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి డీఎస్ఓ, సివిల్ సప్లైశాఖ జిల్లా మేనేజర్ సుగుణాబాయి, జిల్లా సివిల్ సప్లై అదనపు అధికారి సంధ్య తదితరులున్నారు.

ప్రజల సహకారంతోనే సమస్యల పరిష్కారం



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో స్థానిక కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం శ్మశానవాటికలో అక్రమ డంపింగ్‌యార్డు తొలగింపు, శ్మశానవాటిక కబ్జా కాకుండా ధర్నా చేయడంతో సమస్యను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానిక కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని పేర్కొన్నారు. తాను చేస్తున్న పోరాటంలో ప్రజలు కూడా ముందుకురావాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నాచారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: పేదవారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే పథకం సన్నబియ్యం పథకమని నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. సన్నబియ్యం పథకం ప్రారంభంకావడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్‌నేతలు కృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, హెచ్‌ఆర్. మోహన్, రాజు, బండారి రఘు, వెంకటేష్, మహేష్‌యాదవ్, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్

బోడుప్పల్: సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదిగిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి అన్నారు. బోడుప్పల్‌లో మంగళవారం డీలర్ షాపులో నిర్వహించిన తాపీ మేస్త్రీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా అవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయంతో పాటు స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాధ



ఘట్‌కేసర్: ప్రభుత్వాసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్ ప్రసాద్ సేవలకు వెలకట్టలేమని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాధ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ ఎల్‌ఎల్‌ఎస్ కన్వెన్షన్‌లో ఆయన వీడ్కోలు సభలో మాజీ చైర్మన్ పావనీజంగయ్య, పోచారం మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయనను సత్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సంగీత, మాజీ సూపరింటెండెంట్ కోట్య నాయక్, శ్రీ విద్యా ఆస్పత్రి వైద్యులు శ్రీనివాస్, ఇతర వైద్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమం

రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



చర్లపల్లి, సాయినగర్ కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్



గాంధీనగర్‌లో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల పరిధిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని, ఇది చరిత్రలో నిలిచిపోతుందని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం



పీర్జాదిగూడలో మాజీ మేయర్ అమర్‌సింగ్



ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



మచ్చబొల్లారంలో కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్



ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత తదితరులు

మంత్రివర్గంలో మాలలకు అవకాశమివ్వాలి

గౌతంనగర్: మాలమహానాడు ఆఫ్ ఇండియా ముఖ్య నాయకుల సమావేశం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు బిల్లా నరహరి అధ్యక్షతన గౌతంనగర్‌లోని జేఎల్ఎస్‌నగర్‌లో నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రాంమూర్తి హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో మాలలకు చోటు ఇవ్వాలన్నారు. సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి లింగన్న, సాదు, పరమేష్, నాయకులు వేద తదితరులున్నారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

జవహర్‌నగర్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 30న వెంకటేశ్వరకాలనీ కమాన్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండటాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చికిత్స నిమిత్తం అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. 31న అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధేది !

ఆకర్షణీయమైన ప్యాకింగ్, వంటకాల వాసనలు, నోరూరించే ఆహార పదార్థాలు, బయట హోటళ్లు, తోపుడు బండ్లలో కనిపిస్తుంటాయి. భోజన ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం బాగున్నా.. అందులో వినియోగించే నాసిరకం సరుకులు, హానికరమైన రంగులతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది.

– సాక్షి,సిటీబ్యూరో

పట్టించుకోని అధికార యంత్రాంగం

- కిష్టాపూర్‌లో ఇటీవల 47 క్వింటాళ్ల ఆహారపదార్థాలు సీజ్
- శుభ్రత పాటించని ఆహార విక్రయశాలలు
- మాంసం క్రయవిక్రయాల్లోనూ అపరిశుభ్రత

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు, పలు పంచాయతీల్లోని చాలా హోటళ్లు, ఆహారపదార్థాలు, తినుబండారాల తయారీదారులు నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

దాడుల్లో విస్తుపోయే విషయాలు..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల రాష్ట్ర ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) టాస్క్‌ఫోర్స్ బృందం పసుపు, కారం, మసాలాల తయారీకేంద్రాలతో సహా నిల్వ, విక్రయ కేంద్రాలు, పలు రెస్టారెంట్లపై దాడులు నిర్వహించగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. మేడ్చల్ మండలం కిష్టాపూర్‌లో హైదరాబాద్ ఫుడ్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో దాడులు నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ బృందం ఆహార పరిరక్షణ ఉల్లంఘనలను గుర్తించింది.

పారిశుద్ధ్య లోపం.. శుభ్రత శూన్యం..

పారిశుద్ధ్య లోపంతో సహా మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాలలో పరిశుభ్రత లేదని గుర్తించారు. కలుషిత వాతావరణంతో నేల శుభ్రంగా లేకపోవడం, పైకప్పు మీద బూజు, స్పైడర్ వెబ్స్ ఉన్నట్లు బృందం నిర్ధారించింది.

ఆహారపదార్థాల్లో కీటకాలు, పురుగులు..

ఆహారపదార్థాల నిల్వ, పికిల్స్, అల్లం, వెల్లుల్లి పేస్ట్ వంటి పదార్థాలు పూర్తిగా శుభ్రత లేని కారణంగా ఫంగస్‌తో కూడిన ప్లాస్టిక్ కంటైనర్లలో నిల్వ చేయటం, కీటకాలు, పురుగులు పట్టిన కొబ్బరి పొడి, ఎండుమిర్చిని ముడి పదార్థాల స్టోర్‌రూమ్‌లో గుర్తించారు.

రూ.3.03 లక్షల విలువైన కల్తీ పదార్థాల నిల్వ..

అధికారుల తనిఖీల్లో 46.75 క్వింటాళ్ల సెమీ ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం, వెల్లుల్లి పేస్ట్), మసాలా పొడులు కలిగి ఉన్న రూ. 3.03 లక్షల విలువైన నిల్వను సీజ్ చేసి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు.

దుర్వాసన ఉన్న పదార్థాలు ధ్వంసం..

మురికిగా ఉన్న కంటైనర్లు, ఫంగస్ పెరిగిన పదార్థాలు, తేదీలు లేనివి, అధిక దుర్వాసనతో ఉన్న ఉత్పత్తులను ధ్వంసం చేశారు. అపరిశుభ్రత వాతావరణంలో తుప్పు పట్టిన మిషనరీ ఉపయోగించి పలు ఆహార పదార్థాలు తయారీ చేస్తున్నట్లు గుర్తించిన టాస్క్‌ఫోర్స్ బృందం సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయడంతో పాటు అనుమానిత ఆహారపదార్థాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపింది. ఇదే పరిస్థితి శివారుల్లో అంతటా నెలకొని ఉన్నట్లు తెలుస్తోంది.



తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సెఫ్టీ అధికారుల బృందం

వినియోగదారుల చట్టం ప్రకారం..

వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా.. గ్రేటర్ శివారు జిల్లాల్లో అమలుకు నోచుకోవడం లేదు. కూడళ్లు, చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితోపాటు హైదరాబాద్-నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపుల ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు.

రహదారులపై నిత్యం రద్దీగా..

ప్రతిరోజూ వాహనాల రాకపోకలతో రహదారులు దుమ్ము, ధూళి ఆహారపదార్థాలపై పడుతోంది. నిర్వాహకులు వాటిని అలాగే విక్రయిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్ రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు. ఆహార పదార్థాలపై ఎలాంటి రక్షణ చర్యలు లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి.

మాంసం విక్రయాల్లోనూ అంతే..

నగర శివారుల్లోని 29 పురపాలక సంఘాలతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో కూడా పరిశుభ్రత పాటించడం లేదు.

నిబంధనలు గాలికి..

ఇబ్బడిముబ్బడిగా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, తినుబండారాల తయారీ కేంద్రాలు వెలిశాయి. ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలను పాటిస్తూ.. శుభ్రతతోపాటు తాజా సరుకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి.

పర్యవేక్షణ లోపం..

ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండడంతో పాటు పురపాలక సంఘాల్లో కూడా హెల్త్ ఆఫీసర్లు లేకపోవడంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లోని పదార్థాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.